# మయసభ

'వారాహి'



**వి**శ్వనాథం పంతులు గారిని గురించి నా కంత బాగా తెలియదు. ఆయన ఇంకో రెండు మూడు నెలలలో రిటయిరవుతున్నా రనగా నేను హైస్కూలు చదువుకి నాంది పలికాను. ఆ రోజులు నా కంత బాగా గుర్తు లేదు. ఆయన గురించి వాళ్ళా వీళ్ళా చెప్పుకోగా వినడమే. పైగా మా స్వంత ఊరు కూడా అదే గనక ఆ తరవాత ఆయనని అప్పు డప్పుడూ కలుసుకోవడం కూడా కద్దు. మా ఊరి మిడిల్ స్కూలు హైస్కూలు కావడానికి కూడా ఆయనే కారకులు అని పొగుడుతూ ఉంటారు. మొదటి హెడ్ మాస్టారు కూడా ఆయనే. ఆయన కాలంలో హైస్కూలు స్థాయి అన్ని విధాలా పెరుగుతూ ఉచ్చస్థాయి నందు కుంది. ఆయన రిటైరయిన తరవాత... అది వేరే విషయం అనుకోండి.

ఆయన రిటైరయ్యేనాటికి మా స్కూలుకి పదేళ్ళు. ఈ నాటికి దానికి జరగబోయే రజతోత్సవ సందర్భంలో ఆయన్ని సత్కరించాలని నిర్ణయించు కున్నాం మా పాత విద్యార్థుల సంఘం వాళ్లం.

ఆయన దగ్గర చదువుకున్న వాళ్లలో చాలా మంది పెద్ద ఉద్యోగాలలోనూ, అంతస్తులలోనూ ఉన్నారు. ఒక రిద్దరు రాజకీయాలలోనూ ఉన్నారు.

మా జిల్లా కలెక్టరు రంగనాథన్— మా అసోసియేషన్ ప్రెసిడెంటు—ఆయన దగ్గర చదువుకున్న వాడే.

మా ఊరి షావుకారి కొడుకు సంగమేశ్వరరావు పెద్ద కాంగ్రెసు త్యాగిగా పేరెన్నిక గన్నవాడు. చాలా ఏళ్లుగా మా ఊరి ఎమ్. ఎల్. ఎ. కూడాను. ఇటీవలి అధికార వర్గాలలో జరుగుతున్న మార్పులలో అతనికి ఓ మినిస్టరు గిరీ కూడా తగలవచ్చుని ఓ గాలి వార్త ఉంది. పైగా అతను కూడా మా విశ్వనాథం పంతులుగారి వద్ద చదువుకున్న వాడే.

మా 'రజతోత్సవం' జరిగే లోపుగా ఆ సువార్త అందితే ఏకంగా సంగమేశ్వరావు అభినందన ఉత్సవాన్ని కూడా కలిపి జరిపేయ వచ్చుని కొందరు సూచించగా, మరి కొందరు — అతనికి కావలసిన వారు — అది తేలాకనే రజతోత్సవాన్ని ప్రారంభిద్దాం అని సూచన చేయడంతో ఈ విషయమ్మై కూడా మా చిన్న సంఘంలో ఓటింగు జరిగింది. మెజారిటీ సభ్యులు రజతోత్సవ కార్యక్రమం ముందుగానే చేపట్టవచ్చుని ఓటు వేయ

[illegible]తో మా కమిటీ సభ్యులందరం [illegible] విశ్వనాథం పంతులు గారి ఇంటికి [illegible]న్నాం.

ఆయన బాగా ముసలివాడై పోయి ఉన్నారు. కానీ, ఆ వాత్సల్యమూ, ఆ [illegible]గమూ మాత్రం రవ్వంతైనా తగ్గలేదు. ఆయ నెంతో సాదరంగా ఆహ్వానించారు మమ్మల్ని. శాంతంగా మేము చెప్పినదంతా సాంతం విన్నారు. ముందు మెల్లగా మా ప్రయత్నాన్ని నివారింప చూశారు.

"ఎందుకు, నాయనలారా, మీ రింత ప్రయాస పడుతున్నారు? ఈ ఉత్సవాల శుభసమయంలో నేను మీకు గుర్తు రావడమే నా కెంతో ఆనందంగా ఉంది. అదే మీరు నా కివ్వగల అమూల్య గౌరవం. నా చిత్రపటాన్ని ముందరి హాల్లో ఆవిష్కరించ నవసరం లేదు. మీ జ్ఞాపకాలలో నా పేరుంటే చాలు. ఇక పోతే ఈ పటాలకీ, మాలలకీ, సత్కారాలకీ అయ్యే ఖర్చు మీ పాత విద్యార్థుల సంఘం తరఫున స్కూలుకి విరాళంగా ఇవ్వండి. అందరికీ మేలు జరుగుతుంది. ఇక నేను రావడ మంటారా? తప్పకుండా వస్తాను. ఆ నాటి జ్ఞాపకాలని నెమరు వేసుకోవడానికి చక్కని తరుణాన్ని అందిస్తున్నారు. మీ కెంతో ఋణపడి ఉంటాను."

ఆయన అలా గంభీరంగా తన సహజ ధోరణిలో మాట్లాడుతూంటే మే మందరం ఓ రెండు నిమిషాలసేపు స్తబ్ధులమై పోయాం.

చివరికి జిల్లా కలెక్టర్ రంగనాథన్ గారే నోరు విప్పారు.

"మరి ... మీరు కాదంటే మాక డిసప్పాయింటుమెంటే, సార్. ఏదో మాక తోచిన విధంగా వేదిక మీద పదుగురి ముందూ మిమ్మల్ని సత్కరించాలన్న మా అభిలాష. మీరు ఎలాగైనా ... మరి ..."

విశ్వనాథం గారు నెమ్మదిగా నవ్వారు.

"మంచిది నాయనా, నా విద్యార్థులందరూ కలిసి నన్ను సత్కరిస్తానంటే అది మహాభాగ్యంగా భావిస్తాను. కాని వ్వండి, మీ కదే సంతోషదాయకమైతే" అన్నారు.

ఆనందంగా మే మందరం ముకుళిత హస్తాలతో సెలవు తీసుకున్నాం.

ఆ తరవాత కావలసిన కార్యనిర్వాహణలో కి దిగిపోయాం.

• • •

ఆ రోజు సాయంత్రం. "సంగమేశ్వరావుకీ జై!" అంటూ ఓ భక్తజన సంఘం ఊళ్లో ఊరేగింపుని ముమ్మరంగా చేసింది.

మా సంగమేశ్వరావు మంత్రివర్యులై పోయారు. అంటే, ఆయన సరసకి చేరుకోవాలంటే ఇకమీదట నిచ్చెనలతో అవసరా లుంటాయి.

నా మటుకు నాకు సంగమేశ్వరావ్ మీద ఎలాంటి సదభిప్రాయమూ లేదు అతనికి చదువు సంధ్య లేవీ లేవు. సంఘ సేవ అంటాడు. అదేమీ చేసినట్టు నాక కనుపించదు. రాజకీయాలంటే అతని క ఆట. ఎందుకంటే, ఎంతసేపూ పార్టీల మారడమూ, పార్టీలో వర్గాల మారడమూ కనిపిస్తాయి నాకు.

ఏడో ఫారం ముగియకుండానే చదువుకి స్వస్తి చెప్పాడు. ఊరు వదిలి వెళ్ళిపోయాడు. స్వాతంత్ర్య సమరోత్సాహంతో బడి మానేశా నంటాడు. జైళ్లకి వెళ్ళా నంటాడు. సచ్చి కాంగ్రెసు వాదినంటాడు.

నే నివన్నీ ఆలోచించుకుంటూ కూర్చుని ఉన్నాను. హడావిడిగా పరుగెత్తు కొచ్చిన మా సంఘ కార్యదర్శి— మా ఊరి పోలీసు ఇన్‌స్పెక్టరు — నా ఆలోచనలకి అంతరాయం కలిగించాడు.

"ఇదిగోనండీ ... ఈ సంగతి విన్నారా! మన సంగమేశ్వరావుకి మంత్రి పదవి వచ్చింది!" ఆయన ఎంతగానో సంబర పడిపోతూ వార్త అందించాడు.

"ఆఁ ఆఁ. కనిపిస్తోంది. అదే అనుకుంటున్నాను" అన్నాను ముక్తసరిగా.

ఆయన ఒక్క క్షణం అదోలా చూసి మాట్లాడసాగాడు.

"ఇక పోతే ఇందాకనే కలెక్టరు గారు ఫోను చేశారు. సంగమేశ్వరావుగారు మంత్రిగా రయ్యారుగా? ఆయన చిత్ర పటాన్ని కూడా ఆవిష్కరిస్తే బాగుంటుం దన్నారు. పైగా మన వార్షికోత్సవాల సంగతి మంత్రిగారికి కూడా తెలిసినట్టుంది. ఆయన కూడా అందులో పాల్గొనడానికి ఉత్సాహం చూపుతున్నారట. వార్త అందాయట. ఇక ఎలాగూ ఆయనని ఆహ్వానిస్తున్నాం గనక నా కో ఐడియా తడుతోంది. ఏమంటారు?" అని ఆగడతను, నే నంతగా ఉత్సాహం చూపక పోగా.

"ఏమి టది?" అన్నాను నేను.

"ఏమీలేదు. సంగమేశ్వరావుగారు కూడా మన విశ్వనాథం పంతులువద్ద చదువుకున్న వారే గనక ఆయన చిత్ర పటాన్ని ఈయన గారు, ఈయన చిత్ర పటాన్ని ఆయనగారు గనక ఆవిష్కరిస్తే ... ఏమంటారు? బాగుంటుంది గదూ?"

అతనేబాగుంటుందన్నట్టు మాట్లాడుతూంటే నేనేమీ చెప్పలేకపోయాను.

"అందరితోనూ కలిసి మాట్లాడితే బాగుంటుందేమో" అన్నాను మామూలుగా.

"ఆఁ ఆఁ అదంతా అయిపోయింది, మాస్టారూ. ఇంటికి పోతూ మీతో ఓ మాట చెప్పిపోదామని వచ్చాను. మరో గంటలో అందరం స్కూలు వద్ద కలుస్తున్నాము. అక్కణ్ణుంచి విశ్వనాథం పంతులు గారి ఇల్లు దగ్గిరేగా— ఆయనతో మాట్లాడుదామని చెప్పిపోవడానికే వచ్చాను. వస్తాను" అంటూ అతను వెళ్లిపోయాడు.

నేనూ మెల్లిగా లేచాను.

• • •

అలవాటు ప్రకారం మా మాటలన్నీ సాంతం విన్నారు విశ్వనాథం పంతులు గారు.

మేము చెప్పదలుచుకున్నవన్నీ చెప్పాం.

ఆయన పెదవి విప్పి అవుననలేదు, కాదనలేదు. కానీ, అతని భావం స్పష్టంగా మాత్రం తెలిసిపోయింది మాకు — ముఖ్యంగా నాకు.

అతని భావమేమిటో వినడానికి మేము తయారుగా ఉన్నాము.

ఆయనకి కూడా ఏదో ఒకటి చెప్పక తప్పదని తెలుసు గనక ఒకటి రెండు నిమిషాల మౌనం తరవాత మెల్లిగ అన్నారు:

"మీ ఉత్సాహం నాకు అర్థమవుతోంది, బాబూ. కానీ, ఇక్కడ నాకు వ్యక్తిగతంగా ఓ చిక్కు ఉంది. మీ ఆహ్వానాన్ని కాదనలేను. నా చిత్రపటాన్ని మినిస్టరుగా సంగమేశం ఆవిష్కరించడంలో నా కెలాంటి అభ్యంతరమూ లేదు. ఎందుకంటే, అభ్యంతరాలు చెప్పడానికి నా కెలాంటి అధికారం గానీ, హక్కుగానీ లేదు గనక. ఇక పోతే సంగమేశం చిత్రపటాన్ని నేను ఆవిష్కరించా లన్నారు అంతవరకూ బాగానే ఉంది. కానీ, అతన్ని గురించి నాలుగు మాటలు చెప్పాలంటే ఏమని చెప్పను? చూడండర్రా ... ఈ నాడు మీకు సంగమేశం గొప్పవాడు కావచ్చు— పదవి వల్ల. అతణ్ణి గురించి మంచే చెప్పుకోవాలి మనం. కానీ, నాకు తెలిసిన సంగమేశం ఇరవై ఏళ్ల చిన్నవాడు వాణ్ణి గురించి చెప్పుకోవడానికి 'మంచి' అంటూ నా కేమీ తెలియదు గద్రా!"

అని ఆయన సాగదీసేసరికి మే మందరం సిగ్గుపడిపోయి ఒకరి మొహం కొకరం చూసుకుని మిన్నకుండిపోయాం.

ఎంతో ఎత్తుకి ఎక్కాలన్న మా ప్రయత్నంలో ఎవరో మా కాళ్ళ క్రింది నిచ్చెనలని కదిలిస్తున్న భయం కలిగింది మాకు. గడగడలాడిపోయాం దిక్కు తోచక.

మరి ఇక మార్గమేమిటి?


మాకు తోచలేదు.

విశ్వనాథం పంతులుగారికే తోచింది.

"చూడండి, బాబూ ... మీరు బెంగెట్టుకోకండి. నలుగురితో మంచిగ ఉండి బ్రతకాలని మీరు అనుకోవడంలో తప్పు లేదు. మీకు ముస్ముందు జీవితం ఇంకా ఎంతో ఉంది. కానీ, నా దొక్కటే సలహా. పరనింద చేయక, ఆత్మాభిమానాన్ని చంపుకోక, వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూ మీరు ఏ మార్గాన్ని ఎన్నుకున్నా అది మంచి మార్గమే అవుతుంది. అందుకే మీ సమస్యలకి ఈ మార్గాన్ని సూచిస్తున్నాను. మీ తరం మనిషి విజయోత్సాహంలో పాలు పంచుకోవడానికి ఉవ్విళ్లూరుతున్నారు. పాతకాలపు విలువలకి ఈ నాడు ధర కట్టలేరు. కాబట్టి మన బడి రజతోత్సవాల్లో పాత విద్యార్థి విజయానికే ముఖ్యత్వాన్ని ఇవ్వండి. పాత బడిపంతులు ఆ విద్యార్థి బాగుకోసం పడిన శ్రమనీ, ఓటమినీ గుర్తుకు రానివ్వకండి. అదే బహుధా శ్రేయస్కరం. వెళ్ళి రండి, నాయనలారా."

ఆయన మాటలకి మంత్రముగ్ధులమై పోయి పెదవి కదపలేక మాన్పడి కూర్చుండిపోయాం. కాస్సేపటికి మౌనంగా నమస్కరించి వచ్చేశాము.

మా బడి రజతోత్సవాలకి రెండు రోజులు ముందుగా జరిగిన ఈ హఠాత్పరిణామంతో మా సంబరాలలో సంగమేశ్వరావు విజయోత్సాహానికి ప్రాముఖ్యమిచ్చాము. విశ్వనాథం పంతులుగారికి ఒక ప్రేక్షకుని హోదా మాత్రమే ఇవ్వగలిగాము.



చిత్రం— ఎ. మురళీధర్ రావు (హైదరాబాదు)

ఆ అహ్వాన పత్రికని నేను ఆయనకి అందిస్తూంటే నా చేతులు వణికాయి.

ఆయన తొణక్కుండా, బెణక్కుండా ఇతర మంచి పెద్దలని గురించి ప్రస్తావించసాగారు.

ఆ అదను చూసుకుని, పైగా వాతో బాటు ఎవ్వరూ లేనందున మా ప్రవర్తన పట్ల క్షమాపణ కోరుకున్నాను.

నా కళ్ళు కూడా కొద్దిగా చెమర్చాయి.

ఆయన — "ఛ! అదేమిటి, బాబూ! మీరందరూ నాకు పిల్లల్లాంటి వారు, బాబూ. బాధపడకు" అని ఓదార్చారు.

మా మాటల మధ్య సంగమేశ్వరావుని గూర్చి తెలుసుకున్న కొన్ని విషయాలు నన్ను ఆశ్చెరువుపరిచాయి.

* * *

ఆ సాయంత్రం చల్లని వాతావరణంలో, మా స్కూలు ఆవరణలో చక్కగా సాగాయి మా బడి రజత వార్షికోత్సవాలు.

మైకు ముందు వచ్చి నిలబడ్డాడు సంగమేశ్వరావు.

సభలో కరతాళధ్వనులు మూడు నిమిషాల సేపు మిన్నుముట్టాయి.

"సభాసదులకి నా నమస్కారములు" అంటూ మొదలు పెట్టి సంగమేశ్వరావు తను ఎలా స్వాతంత్ర్య సమరంలో స్వార్థాన్ని త్యజించి, ముందు వెనకలు చూడకుండా దూకాడో, ఈ నాటి బాలలు రేపటి పౌరు లెలాగవుతారో, విద్యార్థులయినా వాళ్ళకి ఈ దేశపు ప్రజాస్వామ్యంలో ఎలాంటి భాగమూ, భారమూ ఉంటాయో, విద్యార్జనకీ రాజకీయాలకీ మధ్య అంతరం ఉన్నదన్నది ఎంతటి పాత చింతకాయ పచ్చడో అన్న దాన్ని గురించీ సుదీర్ఘంగా ప్రసంగించసాగాడు.

తను ఎన్నిమార్లు జైళ్ళకి వెళ్ళాడో వివరించాడు.

దేశ నాయకుల్ని ఎందరిని జైళ్ళలో చూశాడో వివరించాడు.

కానీ, నా చెవులు అతని మాటల్ని వినడం మానేశాయి. నా మనస్సు విశ్వనాథం పంతులు గారు చెప్పిన మాటల్నే మననం చేసుకోసాగింది.

"వాడికి ఆ చిన్నతనంలోనే కావలసినన్ని చెడు అలవాట్లుండేవి, బాబూ. తత విధాల చెప్పి చూశాను. వినేవాడు కాదు. ధిక్కరించేవాడు. వాడివల్ల ఇతర పిల్లలు కూడా చెడసాగేసరికి వాణ్ణి స్కూల్లోంచి గెంటవలసిన ఆవసరం ఏర్పడింది. అలా బయటికి నడిచాడు ఏడో ఫారం చదువులో. ఇల్లు వదిలి పోయాడు చేత డబ్బుతో. చేయరాని పను లెన్నో చేశాడు. పోలీసులచేత పట్టుబడ్డాడు. హెడ్‌మాస్టారు హోదాలో నాకు కొన్ని రిఫెరన్సులు కూడా వచ్చాయి. ఎక్కడో ఆరు వందల మైళ్ల దూరంలో జరిగినవి ఇక్కడ ఎవరు చూడగలిగారు? ఎలా పొక్కిందో గానీ వార్త మాత్రం — సంగమేశ్వరావు స్వరాజ్య సమరంలో జైల్లో సడ్డాడని. అదీ అతని జీవితంలోని మొదటి మెట్టు. ఆ తరవాతి మెట్లని తన చాకచక్యంతో చక్కగా కట్టుకోగలిగి, ఈ నాడు ఈ వేదిక నెక్కాడు."

సభలో ఉన్న జనాన్ని చీల్చుకుంటూ బయటికి నడిచాను.

చకచకా నడిచి వచ్చేస్తూంటే లౌడ్ స్పీకర్ లోంచి సంగమేశ్వరావు రాజకీయోపన్యాసం—శ్రోతలని మభ్యపరుస్తూ ఇంకా వినిపిస్తూనే ఉంది.

మధ్యమధ్య ఆ మంత్రముగ్ధులైన సభికుల కరతాళధ్వనులు వినిపిస్తున్నాయి.

ఒక్కసారి తిరిగి చూశాను.

దూరంగా రంగు రంగులుగా కాంతులీనే బల్బులతో, వివిధ రంగులలో చాందినీలతో, తోరణాలతో అందంగా అలంకరించబడిన, ఆకర్షణీయమైన ఆ సభ ఉన్నవి లేనివి గానూ, లేనివి ఉన్నవిగానూ తోపించే మయసభలా కనిపించింది నాకు. ★

## నాటక సమీక్ష

# పార్వతీ కళ్యాణం



ఆధ్యాత్మిక చింతనను ప్రబోధిస్తూ, భగవత్ సాక్షాత్కారగమ్యానికి వెలుగు బాటలను చూపిస్తూ మానవాళికి ధర్మోపదేశం వినిపించడమే పురాణ గాథల లక్ష్యం! వాటిని వాడు చూసినా, నేడు చూసినా దుష్టశిక్షణ, శిష్టరక్షణలతో పాటు శాంతినీ, క్రాంతినీ జగత్తుకు ప్రసాదించడం— అదే వాటిలోని విలువ— వాటిలోని మహత్తు. అందుకే ఎన్నో రచనలు, గాథలు కాలగర్భంలో కలిసిపోయినా పురాణాల పవిత్ర గాథామృతం మానవునికి మానవతను వినిపిస్తూ బ్రతికే ఉన్నాయి.

ఇటువంటి మహత్తరములయిన నాటకాలను, నృత్యాలను ప్రదర్శించడానికీ, ప్రదర్శింపజేయడానికీ నిర్వాహకులలో తగిన శ్రద్ధాభక్తులుండాలి. అదే అనిపించిందికూడా. ఒక సంవత్సరంగా మద్రాసు 'కళావాహిని' కార్యక్రమాలను చూస్తే, నిర్వాహకులు దక్షత కలిగినవారైతే పురాణ గాథలు ఘుమఘుమ లాడతాయి. ఈ సంస్థ అధ్యక్షులు శ్రీ బి. కృష్ణమూర్తి గారిలో ఆ గుణా లున్నవి గనకనే 'కళావాహిని' ప్రాచీన, ఆధునిక సాహితి, సాంస్కృతిక వారధిలా పనిచేస్తూంది.

ఇటీవల మద్రాసు మైలాపూర్ ఫైన్ ఆర్ట్స్ క్లబ్‌లో 'కళావాహిని' ఆధ్వర్యంలో 'పార్వతీ కళ్యాణం' సంగీత నృత్య పౌరాణిక నాటకాన్ని శ్రీ వెంకట సాయీ రాజేశ్వరీ నాట్యమండలివారు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనానికి నగరంలోని తెలుగు ప్రముఖులు చాలా మంది హాజరైనారు.

ఇటువంటి పౌరాణికాలను ప్రదర్శించడానికి, ఆ వాతావరణాన్ని రూపొందించడానికి సాంకేతికమైన అవగాహన అవసరం. ఖర్చుతోకూడిన రంగస్థలాలంకరణ లేనిదే రాణింపు ఉండదు.

అయితే, ఈ బృందం వారు చాలా మట్టుకు శ్రద్ధ తీసుకుని "సెట్టింగులు" అమర్చారు. కైలాసగిరిని కన్నుల పండువగా నెలకొల్పడమే కాదు, గిరీశుడు పార్వతీ సమేతుడై ఉన్న దృశ్యాన్ని ముచ్చటగా చూపారు.

ఈ నాటకంలో మొదటినుండి ఆఖరు వరకు పట్టులో నడిచిన పాత్ర నారదుడు. వేషధారణ, పద్యపఠనం, నటన సమపాళ్లలో సాగి ప్రేక్షకుల అభినందనలు పొందింది. ఇటువంటి పాత్రకు ప్రాంప్టింగ్ అవసరం రావడం బాధే మరి.

ఇంద్రుని పాత్ర చాలా పేలవంగా ఉంది. వాచకం, నటన, హావభావాలు నీరసంగానే ఉన్నాయి. రాక్షసరాజు పాత్ర ఉన్నంతలో బాగానే ఉంది. సాంఘిక నాటకాలలో లాగా ఇంద్రుడు ఆ పనెంత అంటూ చిటికె వేయడం ఏమిటి?

రతీ మన్మథుల ఘట్టంలో రతీదేవి వీథి నర్తకిగా కనిపించింది. పాట అందుకుని ప్రాంప్టింగ్ అందక మధ్యలో మానేయడం పౌరాణిక నాటక సంప్రదాయానికే అగౌరవం.

మరో దృశ్యం శివలింగం, రతీదేవి ప్రార్థన బాగుంది. మొత్తంమీద నాటకం రసవత్తరంగా సాగి ప్రేక్షకులను ఆనందపరిచింది.

జాలరి సెట్టుకు తీసుకున్న శ్రద్ధ మరికొంత బలంగా ఉంటే ముచ్చటగా ఉండేది. జానపద నృత్యం బాగున్నా పాటదారిపాటది, సంగీతందారి సంగీతానిది. 'లైటింగ్' సరిగా ఉపయోగపడలేదు. శివపార్వతుల నృత్యం బాగుంది. కాని, శివుని నృత్యానికి ఇచ్చిన సంగీతం ఊపు ఇంకా వేగంగా ఢమరుకం ధ్వనులతో సాగించి ఉంటే బాగుండేది.

'కళావాహిని' ప్రత్యేక శ్రద్ధతో అటు పౌరాణికాలనూ, ఇటు సాంఘికాలనూ ప్రదర్శింపజేస్తూ తెలుగు సాంస్కృతికాభివృద్ధికి చేస్తూన్న కృషి బహుధా ప్రశంసనీయం.

—ఎల్లోరా